క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నేతాజీనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తారానగర్ ఏఈ ఉమారాణి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు ఫీడర్ పరిధిలోని నేతాజీనగర్, గుల్‌మొహర్‌పార్కు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మియాపూర్‌లో..

మియాపూర్: సురక్ష ఎన్‌క్లేవ్ ఫీడర్ మరమ్మతుల కారణంగా.. మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటలకు విద్యానగర్, సురక్ష ఎన్‌క్లేవ్, సత్య ఎన్‌క్లేవ్, రాజేందర్‌రెడ్డి కాలనీ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 15, పచ్చిమిర్చి 50, బెండ 45, కాకర 50, దొండ 30, దోస 25, ఆలు 25, చామ 50, కీర 25, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 150, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 40, చిక్కుడు 70, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (3) 10 , క్యాలీఫ్లవర్ (1) 30 సొరకాయ (కేజీ) 20, అల్లం 250, వెల్లుల్లి 150.

‘మనూ’లో నేడు వర్క్‌షాప్

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయంలో ఉర్దూ జర్నలిస్టుల కోసం ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్ (ఎంసీజే), యూఎస్ కాన్సులేట్ జనరల్ హైదరాబాద్ సహకారంతో ఉర్దూ జర్నలిస్టులకు ‘కౌంటరింగ్ డిస్‌ఇన్ఫర్మేషన్’ అంశం పేరిట ఉదయం 9.30 గంటలకు సీపీడీ యూఎంటీ ఆడిటోరియంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశానికి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షత వహిస్తారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 28 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్ లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమాన విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..శని,ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 28 మంది పట్టుబడగా వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 26 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున జరిమాన, ఒక వ్యక్తికి రూ.3 వేలు, మరో వ్యక్తి కి రూ.5 వేలు జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.


శ్రీనివాస్‌నగర్ కాలనీలో బస్తీదర్శన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో సోమవారం బస్తీదర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను కార్పొరేటర్ పుష్పనగేష్ దృష్టికి తీసుకొని వచ్చారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుపోయి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సమ్మర్ క్యాంపు

జిన్నారం(పటాన్‌చెరు): డిజైర్ సొసైటీలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులో విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. సోమవారం విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. హైదరాబాద్‌లోని పలు ఐటీ కంపెనీలు విద్యార్థులకు డ్రాయింగ్, డ్యాన్స్, నాటకాలు తదితర పోటీలను నిర్వహించారు. డిజైర్ సొసైటీ డైరెక్టర్ రవిబాబు ఆధ్వర్యంలో ఈ సమ్మర్ క్యాంపును నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్నామని రవిబాబు తెలిపారు.

ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించండి



ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మీకి సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మీని స్థానిక కార్పొరేటర్ పుష్పనగేష్ కోరారు. సోమవారం రామచంద్రాపురం పట్టణంలోని ట్రాఫిక్ సమస్యను వారు పపరిశీలించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లాడుతూ రామచంద్రాపురం వద్ద మూసివేసిన యూటర్న్‌ను తిరిగి తెరిచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. యూటర్న్‌ను మూసివేయడం వలన వృద్ధులు, మహిళలు రోడ్డు దాటాలంటే ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అవసరమైతే ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయలన్నారు. అందుకు ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మీ సానుకులంగా స్పందించారని తెలిపారు. ఇన్‌స్పెక్టర్‌లు కిరణ్ కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.



అడ్డ‘దారి’లోనే..

యూటర్న్ ఉన్నా.. రాంగ్‌రూట్‌లో ప్రయాణం

తరచు ప్రమాదాలు.. పట్టించుకోని పోలీసులు

మియాపూర్: జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఏర్పాటు చేసిన యూటర్న్‌ల వద్ద వాహనదారులు, పాదచారులు రాంగ్ రూట్‌లో రోడ్డు దాటుతున్నారు. దీని కారణంగా తరచు ప్రమాదాలతో బాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, ఆటోలు కూడా రాంగ్‌రూట్‌లో రోడ్డు దాటుతుండడంతో నేరుగా వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు వారిని నిలువరించే ప్రయత్నం చేయకుండా ఫొటోలపై దృష్టి సారిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మియాపూర్, చందానగర్ జాతీయ రహదారి కావడంతో వాహనాల రాకపోకలు ఎక్కువ. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో ట్రాఫిక్ పోలీసులు పలు మార్పులు చేశారు. వాహనాలు వేగంగా ముందుకు సాగాలనే ఉద్దేశ్యంతో జాతీయ రహదారిపై యూటర్న్‌లు ఏర్పాటు చేశారు. మియాపూర్ నుండి బీహెచ్ఇఎల్ కూడలి వరకు పలు చోట్ల యూటర్న్‌లు పెట్టారు. గతంలో కంటే వాహనాల సంఖ్య పెరగడమే కాకుండా వేగంగా వెళ్తున్నాయి. యూటర్న్‌ల వద్ద ట్రాఫిక్ పోలీసులు అదుపు చేయలేకపోతున్నారు. దీనివల్ల యూటర్న్‌ల వద్ద రాంగ్ రూట్‌లో వచ్చే వాహనాలు నేరుగా వచ్చే వాహనాలను ఢీకొంటున్నాయి. యూటర్న్‌ల వద్ద ట్రాఫిక్ సిబ్బంది కనిపించడం లేదు. రాంగ్ రూట్‌లో వచ్చే వారిని నియంత్రించే వారు లేకపోవడంతో యూటర్న్‌ల వద్ద ఎవరికి వారు ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతున్నారు.

- మియాపూర్–చందానగర్ జాతీయ రహదారిపై సంతోష్ దాబా ముందు, మదీనాగూడలోని బజాజ్ ఎలక్ట్రానిక్ ముందు, దీప్తిశ్రీనగర్, స్వాగత్ హోటల్, అనూ ఫర్నిచర్ ముందు, చందానగర్ గంగారంలోని కేఎల్ఎమ్ సమీపంలో ఉన్న యూటర్న్‌ల వద్ద అధిక సంఖ్యలో వాహనదారులు ముందుకు వెళ్లి యూటర్న్ తీసుకోకుండా దగ్గరలో ఉన్న యూటర్న్‌ల నుండి రాంగ్‌రూట్‌లో వెళ్తున్నారు. రాంగ్‌రూట్‌ల వద్ద రోడ్డు దాటేందుకు వెళ్లే క్రమంలో ఎదురుగా వచ్చే వాహనాలతో సంబంధం లేకుండా దాటే ప్రయత్నం చేస్తూ ప్రమాదాలబారిన పడుతున్నారు. ఎక్కడపడితే అక్కడ దూరి వాహనదారులకు ఇబ్బందులు కలగజేస్తున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు సడన్‌గా ఆగిపోవాల్సి వస్తోంది.
- ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, ఆటోలు అదే విధంగా దీప్తిశ్రీనగర్ యూటర్న్ వద్ద చెత్త ఆటోలు, చెత్త లారీలు కూడా అధికంగా రాంగ్ రూట్‌లో చందానగర్ వైపు వెళ్తుంటారు.ట్రాఫిక్ పోలీసులు మాత్రం రాంగ్ రూట్‌లో వెళ్తున్న వాహనాలను ఫొటోలు తీస్తున్నారే తప్పా వెళ్లకుండా చర్యలు చేపట్టడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.
- యూటర్న్‌ల వద్ద వాహన చోదకులకు సూచనలు, రాంగ్‌రూట్‌లో వచ్చే వారిని నియంత్రించేందుకు ట్రాఫిక్ సిబ్బందిని నియమించి అవగాహన కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.





మదీనాగూడలో యూటర్న్‌ల వద్ద రాంగ్ రూట్‌లో వచ్చి రోడ్డు దాటుతున్న వాహనదారులు

కాలనీ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయిస్తాం

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- కమలప్రసన్ననగర్ కాలనీలో కమ్యూనిటీ హాలు ప్రారంభం



కమ్యూనిటీ హాలును ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి తదితరులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని కమల ప్రసన్ననగర్ కాలనీలో పది లక్షల రూపాయల అంచనా వ్యయంతో ఎమ్మెల్యే నిధులతో నిర్మించిన కమ్యూనిటీహాలును సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ రోజాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ కమల ప్రసన్న నగర్ కాలనీ వాసులు విజ్ఞప్తి మేరకు కమ్యూనిటి హాలు నిర్మాణం కోసం సీడీపీ ఫండ్స్ నుంచి 10 లక్షల రూపాయలను మంజూరు చేశామన్నారు. కాలనీ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానందనగర్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు సంజీవ రెడ్డి, నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, నాయినేని చంద్రకాంత్‌రావు, చంద్రమోహన్‌సాగర్, కమలప్రసన్న నగర్‌కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్, వైస్ ప్రెసిడెంట్ తిరుపతి, జనరల్ సెక్రటరి శ్రీశైలం గౌడ్, బందప్ప, శంకర్, వెంకటేస్, అడ్వైజర్ రాఘవులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల కృతజ్ఞతలు...

మేడే ను పురస్కరించుకొని ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల వేతనాలు వెయ్యి రూపాయల చొప్పున పెంచినందుకు సోమవారం ఎమ్మెల్యే గాంధీని పారిశుధ్య కార్మికులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ కార్మికుల సేవలు ఎనలేనివన్నారు.

ఓటరు నమోదులో పూర్తి వివరాలు ఇవ్వాలి

శేరిలింగంపల్లి ఈఆర్ఓ, డీసీ వెంకన్న



రాజకీయ నాయకులు, అధికారుల సమావేశంలో పాల్గొన్న డీసీ వెంకన్న

శేరిలింగంపల్లి: ఓటరు నమోదులో పూర్తి వివరాలు నమోదు చేసుకునేలా చూడాలని శేరిలింగంపల్లి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్ వెంకన్న సూచించారు. సోమవారం శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో అధికారులు, రాజకీయ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడం, తప్పులు లేని ఓటరు లిస్టు తయారీలో రాజకీయపార్టీలు అధికారులతో సహకరించాలన్నారు.అన్ని రాజకీయపార్టీలు డీఎల్ఏలను నియమించుకోవాలన్నారు. ఓటరు నమోదును ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలని ఆయన సూచించారు. ఓటరుకార్డుకు ఆధార్ నెంబర్ అనుసంధానం చేసుకోవచ్చని, తప్పనిసరిగా కాదన్నారు. ఎంఐఎం నాయకుడు నజీర్‌ఖాన్ మాట్లాడుతూ ఓటరు ఉండేది ఒకచోట.. లిస్టులో పేరు మరోచోట ఉండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, అధికారుల దృష్టికి తెచ్చినా ఈ సమస్య తీరడం లేదన్నారు. ఇదిలావుండగా ఈ సమావేశంలో పాల్గొనేందుకు తమకు సమాచారం ఇవ్వలేదని సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో చందానగర్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుధాంష్, వివిధ విభాగాల అధికారులు, బీఆర్ఎస్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ, కాంగ్రెస్, నాయకులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధి పనుల పరిశీలన



శంషీగూడ శ్మశానవాటికలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శంషీగూడ శ్మశానవాటికలోని బండరాళ్లను తొలగించి సుందరీకరణ పనులను చేపట్టాలని స్థానికులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన సోమవారం అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంషీగూడ శ్మశానవాటికలో ఇప్పటికే ప్రహరీగోడ నిర్మాణం పూర్తయిందని, మరుగుదొడ్లు, స్నానాల గదులు, పూజగది వంటివి నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. వాకింగ్ ట్రాక్, సీసీ రోడ్డుతో పాటు ఉద్యానవనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జోగిపేట భాస్కర్ వెంకట్ నాయక్, కసాని శంకర్, వై. శ్రీను, యాదయ్య, సత్తయ్య, మల్లేష్, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా సాగుతాం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు రవికుమార్‌యాదవ్

- బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్
- పీజేఆర్‌నగర్, గుల్షన్‌నగర్, పాన్‌మక్తాలో గడపగడపకూ బీజేపీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా సాగుతామని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ స్పష్టం చేశారు. కొండాపూర్ డివిజన్ లోని పీజేఆర్ నగర్, గుల్షన్‌నగర్, పాన్‌మక్తాలలో గడపగడపకూ బీజేపీ కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో బీజేపీ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతికాలనీ, బస్తీలో డ్రైనేజీ సమస్య, రోడ్లు తదితర సమస్యలు ఉన్నాయని, వాటన్నింటిని పరిష్కరించేందుకు తగిన ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ప్రస్తుతం పాదయాత్ర ద్వారా ప్రతికాలనీలో సమస్యలను గుర్తించడం జరుగుతోందని, ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను కూడా పరిష్కరించేలా చేస్తామన్నారు. శేరిలింగంపల్లిలోని అన్ని డివిజన్లలోని కాలనీలు,బస్తీలలో పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, బీజేపీ నాయకులు మన్యంకొండ సాగర్, చెన్నయ్య, చంద్రశేఖర్‌యాదవ్, రాధాకృష్ణ యాదవ్, ఎల్లేష్, అనిల్‌కుమార్ యాదవ్,రవినాయక్, భరత్ గోపాలకృష్ణరాజు, మఖన్‌సింగ్, బంటి మేరీ పాల్గొన్నారు.

నిరుద్యోగ మార్చ్ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న గోదావరి అంజిరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఈనెల 11వతేదీన సంగారెడ్డిలో బీజేపీ ఆధ్వర్యంలో జరిగే నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలని రాష్ట్ర బీజేపీ మహిళ మోర్చా మాజీ ప్రధానకార్యదర్శి గోదావరి అంజిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సంగారెడ్డిలో జరిగే నిరుద్యోగ మార్చ్‌లో రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు బండి సంజయ్ పాల్గొంటారని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపు నిచ్చారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

నిజాంపేట్: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో ఇంచార్జ్ కమిషనర్ రామకృష్ణ రావు అధ్యక్షతన అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న ఎస్ఎన్‌డీపీ నాలా, రోడ్ల విస్తరణ, భూగర్భ డ్రైనేజీ నిర్మాణం, వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలను సకాలంలో పూర్తి చేయాలని, పనులు చేపడుతున్న క్రమంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు విజయలక్ష్మి, ఆగం రాజుముదిరాజ్, ఇంజనీరింగ్, ఎస్ఎన్‌డీపీ, శానిటేషన్ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జాతర మన సంప్రదాయం



జిన్నారం(పటాన్‌చెరు): జాతరలు మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని చిట్కుల్ సర్పంచ్ నీలంమధు అన్నారు. జిన్నారం మండలంలోని మాదారం గ్రామంలో సోమవారం మల్లిఖార్జున స్వామి జాతర నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేపట్టారు. చిట్కుల్ సర్పంచ్ నీలం మధు జాతరకు హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వామివారి కృపతో ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. మధును ఉత్సవాల నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎస్ఎంఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

వైద్యులకు శిక్షణ

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీలోని డాక్టర్ రావూస్ ఈఎన్‌టి ఆసుపత్రిలో వినికిడి లోపం ఉన్న చిన్నారులకు శస్త్ర చికిత్సలు నిర్వహించే వైద్యులకు, ఆడియోలాజిస్టులకు, శిక్షణ తరగతులు నిర్వహించారు. మూడు రోజుల పాటు సాగిన ఈ శిక్షణ తరగతులలో విదేశాల నుంచి తెప్పించిన అధునాతన యంత్రాల సహాయంతో చిన్నారుల వినికిడి లోపం రావడానికి గల కారణాలు, వినికిడి లోపాన్ని అధిగమించేందుకు చేయాల్సిన శస్త్ర చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డాక్టర్ రావూస్ ఇ.ఎన్.టి డైరెక్టర్ డాక్టర్ శ్రీ రావు పాల్గొన్నారు.

కోనసీమ అందం ఆవిష్కృతమయ్యేలా..





కోనసీమ అందం ఆవిష్కృతమయ్యేలా శంకర్ నిర్మించిన ఆర్చ్ సందర్శకులను ఆకట్టుకుంటుంది. శిల్పారామంలో కోనసీమకు ప్రధాన ద్వారంగా వెదురు బొంగులతో ఆర్చ్‌ను ఆర్టిస్ట్ శంకర్ తయారు చేశారు. దీనిని ఫైబర్‌తో దాదాపు నెల రోజుల పాటు నిర్మించారు. దాదాపు రూ.4.5 లక్షల నుండి రూ. 5లక్షల వరకు అయ్యిందని అధికారులు తెలిపారు. సెలవులు కావడంతో సందర్శకులు ఎక్కువగా వస్తున్నారని పచ్చదనం పెంపునకు వివిధ రకాల పూల మొక్కలను నాటుతున్నట్టు తెలిపారు. – మాదాపూర్

గ్రామాలు కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి



గుమ్మడిదలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- రూ.3.20కోట్ల పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

జిన్నారం(పటాన్‌చెరు): రాష్ట్రంలో అవినీతిరహిత పాలన కొనసాగుతుందని, అందుకే మారుమూల గ్రామాలు కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడెం, గుమ్మడిదల, కానుకుంట, మంబాపూర్, అనంతారం, కొత్తపల్లి, నల్లవల్లి గ్రామాల్లో రూ.3.20 కోట్ల అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగుతుందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్ వైస్ ఎంపీపీ మంజుల, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

టాస్క్‌లు, కమీషన్ పేరుతో మోసం

- రూ. 1,17,000 లక్షలు పోగొట్టుకున్న బాధితురాలు
- మరో ఘటనలో లక్ష రూపాయలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు: టాస్కులు పూర్తి చేస్తే కమీషన్ ఇస్తామని ఆశచూపి సైబర్ నేరగాళ్లు ఇద్దరిని మోసం చేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి...

- అమీన్‌పూర్ పరిధిలోని కిష్టారెడ్డి పేటకు చెందిన ఓ మహిళకు మార్చి 25వ తేదీన ఫోన్‌కు ఆన్‌లైన్ జాబ్ మేసేజ్ వచ్చింది.దీంతో బాధితురాలు లింక్ ఓపెన్ చేసి తాను వివరాలను నమోదు చేసి, నగదు పెడుతూ, టాస్కులు చేస్తు వచ్చింది.ఇలా పలు దఫాలుగా రూ.ఒక లక్ష 17 వేలు పెట్టింది. తిరిగి తాను పెట్టిన నగదు తో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు.దీంతో బాధితురాలు తాను మోసపోయినట్లు గుర్తించి,సైబర్ క్రైం లో ఫిర్యాదు చేశారు.అనంతరం అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.
- అదేవిధంగా అమీన్‌పూర్ పరిధిలోని వందనపురి కాలనీలో ఓ వ్యక్తికి ఏప్రిల్ 30వ తేదీన ఆన్‌లైన్ జాబ్ మేసేజ్ వచ్చింది.దీంతో బాధితుడు తన వివరాలను నమోదు చేసి, నగదు ఇన్వెస్ట్ చేస్తూ మొత్తం రూ.ఒక లక్ష 10 వేలు పెట్టాడు.తిరిగి పెట్టిన డబ్బుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించకపోవడంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైం లో ఫిర్యాదు చేసి, అనంతరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనం,దాడి కేసులో ఒకరికి రిమాండ్

మియాపూర్: ఓ ఇంట్లో దొంగతనం చేసి పారిపోతుండగా అడ్డగించిన యజమానిపై కత్తితో దాడిచేసిన వ్యక్తిని కాలనీవాసులు పట్టుకుని చందానగర్ పోలీసులకు అప్పగించగా సోమవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... కర్ణాటక రాష్ట్రం చించోలికి చెందిన అక్బర్ పాషా(32), మరో వ్యక్తి అర్బాన్‌తో కలిసి నగరంలోని లంగర్‌హౌజ్‌లో నివాసముంటూ హమాలీలుగా జీవనం కొనసాగిస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడి వచ్చిన డబ్బులు సరిపోక దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో అక్బర్‌పాషా, అర్బాన్‌లు శేరిలింగంపల్లి నెహ్రూనగర్‌లో ఓ ఇంట్లో దొంగతనానికి వెళ్లారు. అర్బాన్ అక్బర్ పాషాను ద్విచక్రవాహనంపై ఇంటి వద్ద వదలగా అక్బర్ పాషా ఇంట్లోకి దొంగతనానికి వెళ్లాడు. అర్బాన్ కొంత దూరంలో కాపలా ఉన్నాడు. నెహ్రూనగర్‌లోని సాయిలు(75) ఇంట్లో అక్బర్ డబ్బులు దొంగిలించి పారిపోతుండగా అడ్డుకున్న సాయిలును కత్తితో మెడపై పొడిచాడు. ఈక్రమంలో కాలనీ వాసులు, కుటుంబ సభ్యులు అక్బర్‌ను పట్టుకుని ఆదివారం సాయంత్రం పోలీసులకు అప్పగించారు. సాయిలు అర్చన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా అర్బాన్ అక్కడినుండి పరారయ్యాడు.

పెళ్లి జరుగుతుండగా..పేలిన ఏసీ మిషన్

- నరేన్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఘటన
- రూ. 7.50 లక్షలు తీసుకుని కనీస వసతులు కల్పించలేదని బంధువుల ఆందోళన



నరేన్‌గార్డెన్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న దృశ్యం

మియాపూర్: ఒక వైపు పెళ్లి జరుగుతుండగా భారీ శబ్దంతో ఏసీ మిషన్ పేలిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నరేన్ నక్షత్ర ఫంక్షన్‌హాల్‌లో చోటుచేసుకుంది. వధువు, వరుడు కుటుంబ సభ్యులు , స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం నిజాంపేట్‌కు చెంది కొల్లి సంజీవరెడ్డి కూతురు లాస్య వివాహం మియాపూర్‌లోని నరేన్‌గార్డెన్ నక్షత్ర ఏసీ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఉదయం నుండి పరిమిత సంఖ్యలో ఏసీలు పని చేస్తున్నా అందరూ ఇబ్బందిపడ్డారు. ఫంక్షన్‌హాల్ యాజమాన్యానికి ఫిర్యాదు చేయగా పట్టించుకోలేదన్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఒక్కసారిగా ఏసీ బ్లాస్ట్ అయ్యింది. దీంతో పెళ్లి మండపంలో ఉన్న బంధువులు భయంతో పరుగులు తీశారు. సుమారు వెయ్యిమంది వరకు పెళ్లిలో ఉన్నారు.అయితే ఎలాంటి ప్రమాదం జరగపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఫంక్షన్‌హాల్‌కు ఏడున్నర లక్షలు కట్టించుకున్నారు. ఏసీ ఫంక్షన్‌హాల్ అని చెప్పారు. కనీస వసతులు లేక పోగా ప్రజల ప్రాణాలతో ఫంక్షన్‌హాల్ యాజమాన్యం చెలగాటమాడుతున్నారని నరేన్ గార్డెన్ కార్యాలయం ముందు వారు ఆందోళనకు దిగగా.. అక్కడ సిబ్బంది ఈ ఫంక్షన్‌హాల్‌లో ఇలాంటి సంఘటనలు సర్వసాధారణమే అని మా యజమానులు ఓ పార్టీలో ఉన్నారని ఏమైనా చేసుకోండని బెదిరిస్తున్నారని బంధువులు చెప్పారు. కార్యాలయం ముందు ఆందోళన విషయం తెలుసుకున్న మియాపూర్ పోలీసులు నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు.